# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 10-03-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- దేశంలోని చిన్న నగరాలను మెట్రో నగరాలకు ధీటుగా అభివృద్ధి చేస్తున్నామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.

- మహిళల కోసం ప్రత్యేకంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి పీడిక రాజన్న దొర తెలిపారు.

- హైకోర్టు ఆదేశాల మేరకు డిఎస్సీ పరీక్షలను ఈనెల 30 నుంచి ఏప్రిల్ 30వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్లుగా పాఠశాల విద్యా శాఖ ప్రకటించింది.

- దేశ భవిష్యత్ ను నిర్ణయించే విధంగా తమ ఓటు హక్కును వినియోగించుకుంటామని కొత్త ఓటర్లు ఆకాశవాణికి వెల్లడించారు.

=========================

దేశంలోని చిన్న నగరాలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఉత్తర్ ప్రదేశ్‌లోని అజంగఢ్ జిల్లాలో మండూరి విమానాశ్రయ సముదాయంలో 34 వేల700 కోట్ల రూపాయలతో 782 అభివృద్ధి కార్యక్రమాలకు ఈ రోజు ప్రధాని ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్" అన్నది ప్రభుత్వ విధానంగా వెల్లడించారు. ఆధునిక మౌలిక సదుపాయాలను దేశంలోని ప్రతీ చిన్న నగరాలకు తీసుకెళ్తున్నామని చెప్పారు. పెద్ద నగరాల మాదిరిగానే చిన్న నగరాలు కూడా అభివృద్ధి చెందాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నామని నరేంద్ర మోదీ వివరించారు.

=========================

కడప ఎయిర్ పోర్టు టెర్మినల్ బిల్డింగ్ ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు ఆన్ లైన్ ద్వారా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కడప పార్లమెంటు సభ్యులు అవినాష్ రెడ్డి రాజ్యసభ సభ్యులు సీఎం రమేష్, ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా తో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ అభివృద్ధిలో భారతదేశాన్ని ప్రపంచ దేశాలతో పోటీపడేలా చేస్తున్నారని ప్రశంసించారు.

=========================

రాష్ట్రంలో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండల కేంద్రంలో వై.ఎస్.ఆర్ చేయూత నాలుగవ విడత వేడుకల్లో ఆయన ఈ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మహిళల కోసం ప్రత్యేకంగా అనేక సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని గుర్తు చేశారు. అదే విధంగా ఆరోగ్య శ్రీ ద్వారా క్యాన్సర్, కిడ్నీ తదితర దీర్ఘకాలిక వ్యాధులకు ఉచితంగా వైద్యం అందిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

=========================

ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు ఆదేశాలతో ఉపాధ్యాయ నియామక పరీక్ష డిఎస్సీని ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 30వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేశ్ కుమార్ తెలిపారు. అమరావతిలో ఈ రోజు పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ, హైకోర్టు ఆదేశాలతో ఈ కొత్త తేదీలను ఎంచుకున్నట్లుగా ఆయన వివరించారు. టెట్ కు డీఎస్సీకి మధ్య నాలుగు  వారాల గడువు ఉండాలని హైకోర్టు ఆదేశించిన మేరకు ఈ మార్పులు చేసినట్లు తెలిపారు.

=========================

దేశ భవిష్యత్తు నిర్ణయించే సాధారణ ఎన్నికల్లో ఓటరుగా పాల్గొనేందుకు తాము సిద్ధంగా ఉన్నామని యువ ఓటర్లు చెబుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలోని డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యార్థులు ఆకాశవాణితో మాట్లాడుతూ, ఎటువంటి ప్రలోభాలకు లొంగ కుండా స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కోరారు. భీమవరానికి చెందిన బీటెక్ విద్యార్థిని సమీర మంచి పాలన అందించే వారిని ఎన్నుకునేందుకు తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొంటూ...

(వాయిస్ 11 సెకన్లు)

తొలిసారి ఓటు వేయబోతున్న తన అనుభూతిని దుంపగడపకు చెందిన డిగ్రీ విద్యార్థి సాయి వివరిస్తూ...

(వాయిస్ 13 సెకన్లు)

విరామం

=========================

మహిళా సాధికారత ధ్యేయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2023 నవంబరు 30న డ్రోన్ దీదీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రానున్న నాలుగేళ్లలో దేశంలోని 15 వేల మంది మహిళా సహాయక సంఘాలకు వ్యవసాయ డ్రోన్లు అందించాలన్నది ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం. ఒక్కొక్క యూనిట్ విలువ 8 లక్షల రూపాయలు కాగా, దానికి కేంద్ర ప్రభుత్వం 80 శాతం సబ్సిడీని అందించనుంది. ప్రధానమంత్రి కిసాన్ డ్రోన్ కేంద్రాల ద్వారా మహిళా రైతులకు డ్రోన్ల వినియోగం నిర్వహణపై శిక్షణ కూడా అందిస్తున్నారు. ఈ పథకం ద్వారా  పొందిన డ్రోన్లను ఇతరుల పొలాలకు కూడా వినియోగించటం ద్వారా ఏడాదికి లక్ష రూపాయలకు పైగా ఆదాయం సాధించేలా ఏర్పాటు చేశారు. ఈ పథకం గురించి లబ్దిదారురాలు సురేఖ ఆకాశవాణితో మాట్లాడుతూ...

(వాయిస్ 17  సెకన్లు)

=========================

రాష్ట్రవ్యాప్తంగా ఏజెన్సీ ప్రాంతాల్లో ఈ రోజు నిర్వహించిన బంద్ ప్రశాంతంగా సాగింది. గిరిజన ప్రాంతాలలో పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ రోజు బంద్ చేపట్టారు. బంద్ సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో పలుచోట్ల ఆందోళనకారులను పోలీసులు అదుపులో తీసుకున్నారు. కాగా, ఆదివాసి ప్రాంతంలో స్పెషల్ డిఎస్సీ నోటిఫికేషన్ తక్షణమే విడుదల చేయాలని, నూరు శాతం ఉద్యోగాలను ఆదివాసులకే ఇవ్వాలని కోరుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈ బంద్ నిర్వహించారు.

==========================

అనకాపల్లి జిల్లాలో వేలాది ఎకరాలకు సాగునీటితో పాటు ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేసి తాగునీరు అందిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు తెలిపారు. అనకాపల్లి మండలంలో 84.40 కోట్ల రూపాయల నిధులతో పెద్దేరు జలాశయం ఆధునీకీకరణ పనులకు ఆయన ఈ రోజు శంకుస్థాపన చేశారు. ఈ ఆయకట్టు ఆధునీకరణ అనంతరం 19 వేల 969 ఎకరాలకు సాగునీటి సమస్య తీరనుందని మంత్రి పేర్కొన్నారు.

==========================

నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం అహోబిలం క్షేత్రాన్ని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా ఈ రోజు దర్శించుకుని శ్రీ లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అహోబిలేశుని పారు వేట మహోత్సవాన్ని ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ఇటీవల గుర్తించిన నేపథ్యంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారికి, శ్రీ అమృతవల్లి అమ్మవారికి ప్రభుత్వం తరుపున మంత్రి పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రాచీన పుణ్యక్షేత్రమైన అహోబిలం దేవస్థానం అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 25 కోట్ల రూపాయలు నిధులను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు.

==========================

మహిళలు చిరు వ్యాపారస్తులుగా ఎదగాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం "వైఎస్ఆర్ చేయూత" పథకాన్ని అమలు చేస్తోందని కురుపాం శాసన సభ్యురాలు పాములు పుష్ప శ్రీవాణి తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండల కేంద్రములో వైఎస్ఆర్ చేయూత నాల్గవ విడత వేడుకలలో ఆమె ఈ రోజు పాల్గొన్నారు. గరుగుబిల్లి మండలంలో 4 వేల 115 మంది లబ్దిదారులకు 7 కోట్ల 72 లక్షల రూపాయల నమూనా చెక్కును ఎమ్మెల్యే అందజేశారు.

==========================

తిరుపతిలో సావిత్రిబాయి పూలే 127వ వర్ధంతిని ఈరోజు నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. అలాగే విశాఖపట్నంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో శాసన మండలి సభ్యురాలు వరుడు కల్యాణి మాట్లాడుతూ, సామాజిక సేవ కార్యక్రమాల ద్వారా సావిత్రిబాయి పూలే అట్టడుగు వర్గాలలో స్ఫూర్తిని కలిగించారని అన్నారు.

==========================
==========================